

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 1 పుష్పం : 1-2 20-09-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 16

**VOL : 8** **ISSUE : 01**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278

## జ్ఞానము వలననే మోక్షము

జ్ఞానమనగా ఆత్మజ్ఞానము, అనగా నాగురించిన, వాస్తవముగా నేనెవరో? నా నిజస్థితిని గురించిన జ్ఞానము. అదే మోక్షస్థితి. కర్మలచేతగాని, సంతానముచేతగాని, ధనముచేతగాని, కీర్తిచేతగాని, సమాజమువల్లగాని మోక్షము కలుగదు. త్యాగము చేతనే మోక్షము కలుగుతుంది. త్యాగము అనగా వాసనాత్యాగము. అహంకారమును పరిపూర్ణముగా విడిచివేయటయే నిజమైనత్యాగము. కర్తృత్వం లేకుండా పనిచెయ్యడం, ఆ పనివల్ల వచ్చేఫలితాన్ని ఈశ్వరునికి అర్పించడం త్యాగమవుతుంది. నామ, రూపాలను త్యాగం చేయ్యడమే నిజమైనత్యాగం, కేవలం వస్తువులను విడిచి పెట్టడం త్యాగంకాదు, వాటిని అభిమానించే 'మూల తలంపును' త్యాగం చెయ్యాలి. ప్రకృతి గుణములను అధిగమిస్తే గాని మోక్ష సుఖం అందదు. అభేదదృష్టియే మోక్షము, భేదదృష్టియే బంధము.

నామ, రూపాత్మక జగత్తు ఆత్మ కంటే వేరు కాదు. భేదము గాని, బంధము గాని స్థూల దృష్టియందే కలదు. పారమార్థికముగా లేదు. బియ్యము, నీరు, వంటపాత్ర, కట్టెలు మున్నగుసామాగ్రి అంతయూ సిద్ధముగా నున్ననూ నిప్పు లేనిదే వంట వండుట సాధ్యము కానట్లు, జ్ఞానము లేక మోక్షము సాధ్యము కాదు. జ్ఞానమే ఆత్మ. త్యాగరహితులకు, జ్ఞానశూన్యులకు మోక్షము సున్న. ఉన్న ఏక వస్తువును ఉన్నదానిని ఉన్నట్లుగా అనుభవములోనికి తెచ్చుకొనుటయే మోక్షము.

**చావలి సూర్యనారాయణ మూర్తి**, అమలాపురం

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

01-09-2002 భీమవరం .......... 2
08-09-2002 ఆకివీడు .......... 8

Visit us @ www.srinannagaru.com







**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 1-09-2002, భీమవరం)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు భగవాన్ శ్రీరమణమహర్షి అరుణాచలక్షేత్రం విచ్చేసిన రోజు. 1896 సం॥ సెప్టెంబరు 1వ తేదీన భగవాన్ అరుణాచలం వచ్చారు. మానవుడు స్వభావం మార్చుకోవటం చాలాకష్టం. పూజలుచేయటం, తీర్థయాత్రలుచేయటం తేలిక, ఇవిఅన్నీ మనం పవిత్రులం అవ్వటానికి చేయాలి. మనస్వభావం అహంభావస్వభావం. ఇందులోనుండి విడుదల పొందితే గాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. కృష్ణుడు ఒకమాట మాట్లాడినా, ఒకపని చేసినా ఆయన చేష్టలు అన్నీ మానవుడిని అహంభావస్వభావంలోనుండి విడుదల చేయటానికి అనుకూలంగా ఉండేవి. కృష్ణుడి ఉపాధిద్వారా శక్తి ఎక్కువగా వ్యక్తమయ్యింది. కోరికకు, కామానికి అతీతమైనది రాసలీల. రాసలీల ద్వారా మనం అర్థం చేసుకొనేది ఏమిటి అంటే కామలోలుడు అనికాదు, కామవిజేత, అక్కడ మన్మధుడిని ఓడించాడు. మన స్వభావం ఎటువంటిదో మనకు తలంపువచ్చిన తరువాత తెలుస్తుంది, కాని లోపలఉన్నఈశ్వరుడికి మనకు తలంపు రాకముందే మనస్వభావం తెలుస్తుంది. మనం తల్లి కడుపులో పడక ముందే మనం ఎటువంటి వారిమో భగవంతుడికి తెలుస్తుంది. మనఇంట్లోఉన్న పదిమంది ఒకరకంగా ఉండరు, ఒకరకంగా ఉండాలనుకోవటం అది మీఅహంకారానికి గుర్తు. ఎవరిపద్దతిలో వారిని అభివృద్ధిలోనికి రానివ్వాలి, వారు అభివృద్ధిలోనికిరావాలని మనం భగంతుడిని ప్రార్థించాలి. అలా ప్రార్థించటంవలన వారికి శ్రేయస్సుకలుగుతుంది. మనకు భక్తి అభివృద్ధిఅవుతుంది. మనస్సు అనేక విషయాలను కల్పిస్తుంది. దానిని ఒకప్రక్కనపెట్టి భగవంతుడుచెప్పిన మాటలను ప్రమాణంగా పెట్టుకొని జీవించండి. మనస్సుకల్పించిన విషయాలతో జీవిస్తూఉంటే వర్తమానకాలం చెడిపోతుంది. శక్తి వృధాఅవుతుంది. మనంచేతులతో పూజచేస్తాము, వాక్కుతో జపం చేస్తాము, మనస్సుతో ధ్యానం చేస్తాము. మనం పవిత్రులం అవ్వటానికి ఈ మూడింటిని మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. లోకాన్ని చూసి మీరు కంగారు పడకండి. ఈ దేహం ఎంత నిజమో లోకంకూడా అంతేనిజం, లోకంలో జరిగే సంఘటనలు కూడా అంతేనిజం. ఇవిఅన్నీ వ్యవహారికసత్యములే. ఇవి చైతన్యానికి సంబంధించిన విషయాలుకాదు. ఒక్క భగవంతుడుతప్పించి ఈసృష్టిలో ఏదీనిజంకాదు. అందుచేత భగవదనుభవం పొందటానికి ప్రయత్నంచేయాలి. నీవు

సాధనచేసి, శ్రవణంచేసి, మననంచేసి, సత్పురుషులతో సహవాసంచేసి, మంచిఆలోచనలు వచ్చేలాగచేసుకొని నీవు పొందవలసింది భగవంతుడినే తప్ప అంతకంటే ఈసృష్టిలో ఏదీలేదు. మనిషినినడిపేది బుద్ధి, ఆబుద్ధి విషయంలో మనం జాగ్రత్తగా ఉండాలి, బుద్ధిని సాత్వికం చేసుకోవాలి. సాత్విక బుద్ధిని సంపాదిస్తే మన మాట, చేత, వ్యవహారం అంతా సాత్వికంగా ఉంటుంది. ఎవరితోటి వైరం పెట్టుకోవద్దు, ఎవరిని చూసి అసూయ పడవద్దు అని భగవంతుడు చెపుతున్నాడు. నువ్వు నా పఠందగ్గర కూర్చొని, నన్ను ప్రార్థిస్తున్నావు అనుకో నీకు ఎవడిమీద అయితే అసూయ ఉందో, వైరం ఉందో వాడు జ్ఞాపకం వస్తూ ఉంటే నా రూపాన్ని, నామాన్ని ఎలా ధ్యానించగలవు. ముందు అసూయను, వైరాన్నిపోగొట్టుకొని నన్ను ధ్యానంచెయ్యి అని భగవంతుడు చెపుతున్నాడు.

నిరంతరము నన్నుస్మరించటం వలన, ధ్యానించటంవలన నీబుద్ధిని నాకు సమర్పించటం వలన, నాకు శరణాగతి చెందటం వలన నీవు నా దయకు పాత్రుడవు అవుతావు. ఎప్పుడయితే నాదయకు పాత్రుడవుఅయ్యావో నీబుద్ధిలో ఉన్నదోషములనుండి, బలహీనతలనుండి నిన్ను విడుదలచేసి నీకు శాశ్వతశాంతిని, మోక్షాన్ని ప్రసాదిస్తాను అనిభగవంతుడు చెపుతున్నాడు. జ్ఞాన సముపార్జనపట్ల నీమనస్సును నిలబెట్టు, నీరూపబుద్ధిని, నామబుద్ధిని పెంచుకోవటానికి పనిచేయకుండా నిర్మలంగా, నిశ్చలంగా, నిరాడంబరంగా లోకంకోసం పనిచేస్తూ ఉంటే ఆపని నిన్నుబంధించదు. స్వార్ధంలేకుండా చేసేపని నిన్నుఅంటదు. ఇలా పనిచేయటం వలన ఆగామి, సంచితం కూడా సమగ్రంగా కాలిపోతాయి. దేహమునేను అనే తలంపుకు అంటిపెట్టుకొని ఉన్నకర్మ అంతానశిస్తుంది. ఎప్పుడయితేకర్మ సమగ్రంగా నశించిదో నువ్వు జైలునుండి విడుదల పొందుతావు. జననమరణ చక్రంనుండి విడుదలపొందుతావు. ఒకభక్తుడు భగవాన్‌తో రెండునెలలు మీదగ్గర ఉన్నాను, ఈరాత్రికి వెళ్ళిపోతున్నాను, మిమ్మల్ని విడిచివెళ్ళటం కొంత కష్టంగాఉంది, కాని నేనువెళ్ళాలి, నాక్షేమం ఏమిటో నాకంటే మీకే బాగాతెలుసు, నేను వెళ్ళేముందు నాలుగుమాటలు చెపితేవింటాను అనిఅడిగాడు. భగవాన్ అతనితో నీవు శాంతిగాఉండటం నేర్చుకో. సర్వకాలసర్వావస్థలలో నీవు శాంతిగాఉండాలి. గురువుని విడిచిపెట్టి దూరంగా వెళ్ళిపోతున్నాను అని నీవుఅనుకొంటున్నావు, గురువు బయటలేడు, నీ లోపలేఉన్నాడు, గురువు లేనిచోటు అంటూలేదు గురువుఅంటే చైతన్యం. నువ్వు శరీరం అనుకొంటున్నావు కాబట్టి గురువును కూడా ఆశరీరానికి పరిమితం చేస్తున్నావు. గురువు నీ హృదయంలో ఉన్నాడు, గురువును విడిచిపెట్టి నీవు ఎక్కడికివెళ్ళటంలేదు. జీవితంలో ఎప్పుడూ ఆత్మవిశ్వాసం విడిచిపెట్టవద్దు. మీరు అన్ని విధముల ప్రయత్నం చేసి ఆత్మవిశ్వాసం పెంచుకోండి. మీరు భౌతికంగా, ఆధ్యాత్మికంగా బాగుపడతారు. మీకు వెనకాల బంధువుల బలం లేకపోయినా, డబ్బు లేకపోయినా, స్నేహితులబలం లేకపోయినా ఒక్క ఆత్మవిశ్వాసం ఉంటే మీరు జీవితంలో అభివృద్ధిలోనికి వస్తారు. మనం బంధువులు, స్నేహితులు ఉద్దరిస్తారుఅని కనిపెట్టుకొని ఉండవద్దు, మన ఆత్మవిశ్వాసం మనలను ఉద్ధరిస్తుంది. బంధువులు మనలను ఉద్దరించనక్కరలేదు మనలనుచూసి అసూయపడకుండా ఉంటేచాలు. ఆత్మవిశ్వాసం వలన మీరు నిర్మలంగా, నిశ్చలంగా ఉండగలరు, కూల్‌గా పనిచేయగలరు. ప్రపంచంకాదు మిమ్మల్ని అనుగ్రహించేది, మిమ్మల్ని అనుగ్రహించేది, ఉద్దరించేది ఈశ్వరుడు ఒక్కడే. మీరు కొంత ప్రయత్నం చేస్తే, సాధన చేస్తే ఈశ్వరానుగ్రహం మీ శిరస్సు మీద వర్షిస్తుంది, ఈశ్వరానుగ్రహం ఉంటే మాయ దారిఇస్తుంది. గురువు నీకూడానే ఉంటాడు. నీ బుద్ధిలో ఉన్నదోషాలను చూస్తూ ఉంటాడు, ఆ దోషాలనుండి నిన్ను ఎలా విడుదల చేయాలో ఆ పరిస్తితులలో నిన్ను ఇరికిస్తూ ఉంటాడు. మీ మీద ఇష్టం లేకకాదు, నీ మీద ప్రేమ వలన ఈ పనులు అన్నీ చేస్తూఉంటాడు. నిజమైన గురువు భక్తుడిని తనంతటవాడిగా చేయటానికి చూస్తాడు. భగవదనుభవం పొందటానికి నీలో ఏదోషాలు అడ్డుగాఉన్నాయో చూసి, వాటిని తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు. నిన్ను ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దటానికి ప్రయత్నంచేస్తాడు. వాడు గురువు. గురువు నీలోపలే ఉన్నాడు, వాడు సోమరితనంగా లేడు. నిన్ను సరిదిద్దటానికి ఏక్షణానికి ఆక్షణం ప్రయత్నం చేస్తున్నాడు. నువ్వు ఏదిగా ఉన్నావో ఆస్థితిలోనికి నిన్ను నెట్టటానికి, అక్కడ నిన్ను ముంచటానికి ప్రయత్నం చేస్తున్నాడు. ఈదేహం యొక్క పుట్టక, చావు నిజంకాదు. ఏది నిజమో నీగురువుకు తెలుసు అందులో నీవు లయంఅయ్యే వరకు గురవు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వేటగాడు జంతువును ఎలా వేటాడుతాడో అలాగ నీ అహంకారాన్ని వెంటాడి, వేటాడి దానిని నాశనంచేసి నీస్వరూపంలో నీవు లయంఅయ్యేవరకు నిన్ను విడిచిపెట్టడు, వాడు గురువు. గురువు అంటే ఆత్మ. బయట కనబడే శరీరం గురువుకాదు. నువ్వు లోపలకువెళ్ళు, లోపలఉన్న గురువును కనిపెట్టు. నువ్వు లోపలకు వెళ్ళాలంటే నీకు సూక్ష్మబుద్ది ఉండాలి. విషయచింతన తగ్గించుకొని ఆత్మచింతన చేసే కొలది నీకు బుద్ది సూక్ష్మత వస్తుంది. మనం ఇప్పుడు ఏదైతే నేను, నేను అంటున్నామో ఈనేను నిజం కాదు. ఇది అబద్దమైన నేను, తింగర నేను. మనకు ఇప్పుడు నేనుగా వ్యక్తమయ్యేది ఆత్మకాదు. అహంకారమే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. ఇది బుడగ, ఈ

బుడగకోసం మహాసముద్రాన్ని వదులుకొంటున్నాము. ఈ అహంకారం అనేది పైనఉన్న నురుగు. ఈ నురుగుకోసం జ్ఞానగంగను వదులుకొంటున్నాము. ఈ అహంకారం అనే గడపదాటితే గాని మనకు ఆత్మజ్ఞానం కలుగదు. గీతలో భగవంతుడు చెప్పిన మాట సత్యం అని ముందు నమ్మండి. అది మీలోపల ఉన్నసత్యం దగ్గరకు మిమ్మల్ని తీసుకొని వెడుతుంది. అది నమ్మకుండా మనం లోపలకు వెళ్ళలేము. తింగరనేను చెప్పిన మాటలు మరుసటి రోజే పోతాయి. గీతలో చెప్పినది నిజమైన నేను చెప్పింది. నీ పూర్వజన్మ సంస్కారములు వాసనలు నిన్ను లోపలకు వెళ్ళనివ్వవు. ఈశ్వరుని దయలేకుండా, ఆయన ఆశీస్సులు లేకుండా మనం లోపలకు వెళ్ళలేము. దేవుడు చెప్పిన వాక్యం సత్యం అని నమ్మితే ఆ వాక్యం మనలను లోపలకు తీసుకొని వెళుతుంది. ఇప్పుడు నీవు విషయాలతో అనుబంధం పెట్టుకొన్నావు. గురువు నీలోపలే ఉన్నాడు. ఆయనతో నిరంతరం అనుబంధం పెట్టుకో. అలా అనుబంధం పెట్టుకొంటే నీకు లోచూపు కలుగుతుంది. ఎప్పటి కప్పుడు నీలోపల నుండి ఆయన సందేశం నీకు అందుతూ ఉంటుంది. గురువును నువ్వు వదలివేసినా, ఆయన నిన్ను వదలడు. గురువును వదిలిపెట్టి నీవు దూరంగా వెళ్ళాలన్నా వెళ్ళలేవు. దేహం నీవుకాదు అన్న సంగతి నీకు అర్థమయినప్పుడు కాలంతోటి, దేశంతోటి, ప్రాంతంతోటి సంబంధం లేకుండా అంతటా నీవు ఉన్నావన్నసంగతి నీకు అనుభవంలోనికి వస్తుంది, అప్పుడు నీకు రాకలేదు, పోకలేదు నేనుఅనే తలంపు వచ్చాక దేహంవస్తుంది దేహంవచ్చాక లోకం వస్తుంది. లోకంవచ్చాక దేవుడువస్తాడు. ఈనేను అనేతలంపు హృదయంలో అణిగిపోతే దేహంలేదు, లోకంలేదు, దేవుడు లేడు.

ప్రతీ మానవుడికి సుఖం, శాంతి, ఆనందం కావాలి. ఆ సుఖం, శాంతి, ఆనందం వాడి స్వరూపంలోనే ఉన్నాయి. వాడి స్వరూపమే జ్ఞానం. అది తెలియకపోవటం అజ్ఞానం. మనం సుఖంకోసం బయట వెతుకుచున్నాము. సుఖం ఎక్కడ ఉందో అక్కడ వెతకటం లేదు, లేనిచోట వెతికితే కోటిజన్మలు ఎత్తినా అది దొరకదు. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతికితే అది దొరుకుతుంది. బాహ్యంగా విజృంభిస్తున్న నీ మనస్సును ఆపుచేసి దానికి లోచూపు నేర్పి, విషయబుద్ధిలోనుండి నిన్ను విడుదల చేసి నీకు ఆత్మబుద్ధిని కలుగజేసి సత్య వస్తువు ఎక్కడ ఉందో అక్కడకు చేరటానికి నీకు సహాయ సహకారములు అందించేవాడే గురువు. ఆత్మజ్ఞానం పొందటం అంటే ఆత్మనుచూడటం కాదు, చూడటంఅంటే చూడబడే వాడు, చూచేది ఇద్దరు అయ్యారు. మీరు ఆత్మగా ఉండాలి అదే మీ కడసారి జన్మ.

**20-09-2002**

లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. ఏ ఆకర్షణకు మోహపడినా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. మనం అందరం సాధనలో ఫెయిల్ అవ్వటానికి కారణం ఏమిటి అంటే అందరూ మేము సాధన బాగా చేస్తున్నాము అని చెప్పేవారేగాని ఎవరూ లోపలకు వెళ్ళటంలేదు. మన హృదయంలో సత్యవస్తువు ఉన్నప్పటికి దానిని గుర్తించకుండా ఏ అహంభావన అయితే అడ్డువస్తోందో దాని టెమ్‌టేషన్ మనకు ఎక్కువగా ఉండటం వలన మనం సాధనలో ఫెయిల్ అవుతున్నాము. అహంభావనే మనం అనుకొంటున్నాము కాబట్టి అది ఎంతసేపు పొంగుతూ ఉంటుంది, మనం దాని ఆకర్షణలోనుండి విడుదల పొందలేకపోతున్నాము, ఇలా మనం ఎన్ని జన్మలు ఎత్తినా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. నాకు కష్టాలు ఇవ్వమని కుంతీదేవి కృష్ణుడిని ప్రార్థించేది. అందరూ సుఖాలు కోరుకొంటున్నారు మరి నువ్వు కష్టాలు కోరుకొంటున్నావు ఏమిటి అని కృష్ణుడు కుంతీదేవిని అడుగుతాడు. ఆ కష్టాల వలన నిరంతరం నీ స్మరణలో ఉంటాము. నువ్వునిజం, కష్టాలు నిజంకాదు. ఆ కష్టాల వలన నిన్ను స్మరిస్తూ ఉంటాము. నిన్ను నిరంతరం స్మరించటం వలన నాకు నిజం తెలుస్తుంది. అందువలననాకు కష్టాలు ఇయ్యి అని కుంతీ దేవి అడిగింది. మీరు కష్టాలు కోరి తెచ్చుకోవద్దు. మీకు జీవితంలో కష్టాలు వస్తే వాటిని అనుకూలంగా త్రిప్పుకోండి. మనం కారణంలేకుండా ఎక్కువగా ఉద్రేకపడుతూ ఉంటాము, దానివలన మనం పాడైపోతున్నాము. మనం సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయకపోతే కామక్రోధములనుండి మనం విడుదల పొందలేము. సక్రమంగా ఆలోచించు, కుదురుగా ఉండు అనే వారు భగవాన్. నీ మనస్సు నిశ్చలంగా ఉంటే నిర్మలంగా ఉంటే, నిరాడంబరంగా ఉంటే, చల్లగా ఉంటే లోపల ఉన్న వస్తువును నీవు తెలుసుకోవటం కాదు, అది నీకు తెలియబడుతుంది. దేహం ఉన్నా లేకపోయినా, ప్రపంచం కనిపించకపోయినా, కనిపించినా నీవు ఏ అవస్థలో ఉన్నా నీలోపల ఒక వస్తువు ఉంది, అది ఒక్కటి మాత్రమే నిజం, అసలు ఉన్నదే అది, మిగతాది అంతా నీ మనస్సుయొక్క కల్పితం. నీ మనస్సు ఎంత నిజమో మనస్సు కల్పించిన విషయాలు కూడా అంతేనిజం. నీ హృదయంలో ఉన్న సత్యవస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటానికి తదనుగుణంగా నీ జీవితాన్ని తీర్చిదిద్దుకో. నీ జీవితాన్ని తీర్చిదిద్దుకోవటానికి ఏ విషయాలు అయితే అటంకాలుగా ఉన్నాయో నీకు తెలియకపోయినా గురువుకు తెలుస్తాయి. అందుచేత గురువు లోపల ఉండి ఆ బలహీనతలకు నిప్పు పెడతాడు, అది నీ మీద ఇష్టంలేక కాదు, నీలోపల ఉన్నదుమ్ము అంతా బయటకు గెంటటానికి గురువు అలా చేస్తూ ఉంటాడు. నీ బుద్ధిలో ఉన్నదోషాల వలన ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు తెలియటం లేదు అని గురువుకు

తెలుసు. ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు తెలియటానికి నీచేత సాధన చేయిస్తాడు, నీ మీద దయ చూపిస్తాడు, తలుపుసందున పెట్టి నొక్కినట్లుగా నిన్ను నొక్కుతాడు, కంగారు పడవద్దు. ఆయన ఆగ్రహం కూడా అనుగ్రహమే అని నీవు అర్థం చేసుకోవాలి. నువ్వు ఇతరులకు ఏదైనా ఇచ్చావు అనుకో అది తిరిగి నీకు వచ్చేస్తుంది అంటారు భగవాన్. ఆ విషయం నీకు తెలియక నేను ఇతరులకు ఇచ్చాను అనుకోంటావు. ఇవ్వటానికి ఎవరు ఉన్నారు? ఉన్నది ఒక్కటే. ఈ ఇవ్వటాలు, పుచ్చుకోవటాలు అన్నీ కూడా మనోగతాలు, దేహగతాలు, అహంకారగతాలు. అసలు వస్తువుకు దీనికి ఎటువంటి సంబంధంలేదు. అసలు వస్తువుకు అది తప్పించి ఏదీ లేదు. ద్వితీయమే లేదు. అసలువస్తువు నీ హృదయంలో ఉంది. దానిని సిద్ధింపచేసుకో. స్వామిదర్శనానికి వెళ్ళినప్పుడు కోరికలు కోరుతున్నారు. దానివలన మీ కోరికలు నెరవేరవచ్చు. ఇది అంతా తాత్కాలికం. ఇవి అన్నీ కాలాప్రవాహంలో కొట్టుకొని పోతాయి. అందుచేత స్వామి దగ్గరకు వెళ్ళినప్పుడు ఏదో కోరుకోవటం కాదు ఆయననే కోరుకోండి, జ్ఞానాన్ని కోరుకోండి.

2A

## రమణభాస్కర

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 8-09-2002, ఆకివీడు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పనిచేయండి, కర్తృత్వం లేకుండా పనిచేయండి నేను అనే తలంపు లేకుండా పనిచేయండి అని భగవాన్ చెపుతున్నారు. శరీరం వస్తే ఆ శరీరం ఏ పని నిమిత్తం ఈ భూమి మీదకు వచ్చిందో నీవు కర్తను అనుకొన్నా, నీవు కర్తను అనుకోకపోయినా ఆ పని నీ శరీరం ద్వారా జరుగుతుంది. దేహం యొక్క ప్రారబ్దం ననుసరించి ఆదేహం పనిచేసి మరణిస్తుంది. ఆదేహం ద్వారా జరిగే పనితో నీవు తాదాప్యం పొందవద్దు. అన్ని లాభముల లోనికి ఆత్మలాభం గొప్పది, అన్ని సుఖాలలోనికి ఆత్మసుఖం గొప్పది. అటువంటి ఆత్మలాభాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి అని భగవంతుడు చెప్పాడు. సబ్జక్టు సరిగా అర్థమయితే అన్ని లాభములలోనికిగొప్పది అయిన ఆత్మలాభమును ఈ భూమి మీద ఉండగానే పొందుతారు. దేహప్రారబ్దమును బట్టి సన్మానములు, అవమానములు వస్తూ ఉంటాయి. ఒకోసారి పరిస్థితులు మీకు అనుకూలంగా ఉంటాయి, ఒకోసారి ప్రతికూలంగా ఉంటాయి,



ఇది నగ్నసత్యంకాదు, ఇవి అన్నీ వ్యవహారిక సత్యములు మాత్రమే. రెండు విషయాలు జీవితం పొడుగునా గుర్తుపెట్టుకోండి. మీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పుడు గర్వం రాకుండా చూసుకోండి, పరిస్థితులు వ్యతిరేఖంగా ఉన్నప్పడు బాధ రాకుండా చూసుకోండి. ప్రారబ్దమును బట్టి ఒకోసారి అదృష్టం, ఒకోసారి దురదృష్టం వెంటాడతాయి. అదృష్టం వెంటాడినప్పడు గర్వం తెచ్చుకోవద్దు, దురదృష్టం వెంటాడినప్పడు నిస్పృహ రాకుండాచూసుకోండి, బాధ రాకుండా చూసుకోండి. మీకు గర్వం వచ్చినా, బాధ వచ్చినా ఆత్మజ్ఞాన సముపార్జనకు మీరు నడిచే మార్గం తప్పిపోతారు. మనస్సుకు పొంగువచ్చినా కృంగువచ్చినా మీరు గమ్యాన్ని చేరుకోలేరు సరికదా గమ్యాన్ని మర్చిపోతారు. ఇది దృష్టిలో పెట్టుకోండి. ఏ మనిషిని మానవజాతి ఎక్కువగా గౌరవిస్తుంది అంటే వాడికి డబ్బు ఉన్నా విద్య ఉన్నా వాడిని గౌరవించరు, ఎవడైతే సర్వకాల సర్వావస్థలలో గర్వంలేకుండా ఉంటాడో వాడినే సమాజం గౌరవిస్తుంది అని భారతంలోచెప్పారు. శరీరం ఏ పని నిమిత్తం వచ్చిందో ఆ పని ఆ శరీరం ద్వారా జరుగుతుంది. అందువలన ఇది నేను చేస్తున్నాను అని కర్తృత్వ భావన పెట్టుకోవద్దు. పని విడిచిపెట్టవద్దు నేను చేస్తున్నాను అనే భావనను విడిచిపెట్టు. దేహం ద్వారా ఒక పని జరుగుతూ ఉంటే అది భగవంతుడు ఇచ్చిన ఒక అవకాశం అనుకొని పనిచెయ్యాలి.

నేనునేను అని చెప్పేది దేహం కాదు, లోపల ఉన్న ఆత్మ కాదు, వీటికి మధ్యలో ఉన్న అహంభావనే నేను, నేను అంటోంది. ఈ అహంభావనకు మేత ఏమిటి అంటే రూపచింతన, నామచింతన. జాగ్రదవస్థలో ఉండగా ఏదో రూపాన్ని, నామాన్ని చింతించకుండా మీలో ఎవరైనా ఉన్నారా? ఆ రూపచింతన, నామచింతనే మీ అహంభావనకు ఆహారం సప్లయి చేస్తున్నాయి. అహంభావనకు ఉపాధి ఈ శరీరం. అది ఎప్పడూ ఏదో రూపాన్ని నామాన్ని పట్టుకొని ఉంటుంది. రూపాలను, నామాలను మారుస్తుంది. ఈ అహంభావనను మీరు దేవుడు అనుకొంటున్నారు. అది దేవుడు కాదు, అది దెయ్యం. అది దెయ్యం అన్న సంగతి మీకు తెలియటం లేదు, మీరు దారితప్పిపోతున్నారు. అహంకారాన్ని నాశనం చేయటమే మీ జీవితగమ్యం. అహంకారం నశించకుండా ఎవరికీ ఆత్మజ్ఞానం కలుగదు, ఆత్మశాంతి కలుగదు.

అహంకారం నశించాలంటే నిరంతరం ఆత్మను చింతించు. అన్యచింతలు కొంచెం కూడా నీ మనస్సు లోనికి రాకుండా చూసుకో. అదే సాధన అని భగవంతుడు చెప్పాడు. అహంభావన దెయ్యం అని మీకు తెలియకపోవటం ఒక పొరపాటు, అంతేకాదు దానిని